ఆంధ్రభూమి
గురువారం, 15 మార్చి 2018 విశాఖ జిల్లా

# సీఎం దత్తత గ్రామాలను సందర్శించిన కేంద్ర బృందం



పెదలబుడు సందర్శించిన బృంద సభ్యులు

అరకులోయ, మార్చి 14: కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కేంద్ర పరిశోధన బృందం పెదలబుడు పంచాయతీలోని 22 ఆవాస గ్రామాలను బుధవారం సందర్శించింది. కేంద్ర పరిశోధన బృందం నాయకుడు ఆచార్య డి.సుందరరామ్ నేతృత్వంలో సభ్యులు సాయికుమార్, భగవాన్‌రెడ్డి గిరిజన గ్రామాల్లో నిర్మితమైన సిమెంట్ రోడ్లు మంచినీటి కుళాయిలు, మంచినీటి ట్యాంక్, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, నిత్యావసర వస్తువుల విక్రయ శాల, పాఠశాల, చెక్‌డ్యాం, ఘనవ్యర్థ పదార్థాల నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించి పౌరుల నుంచి పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా బృందం నాయకుడు సుందరరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తత తీసుకున్న పెదలబుడు పంచాయితీలోని 22 గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి ఈ గిరిజన గ్రామాలను దత్తత తీసుకోవడం వలనే అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నట్టు ఆయన చెప్పారు. గతంలో ఈ గ్రామాలకు చెందిన గిరిజనులు కలుషిత నీటిని వినియోగించి వ్యాధుల బారిన పడేవారని, రవాణా సదుపాయం లేక కాలిబాటనటే మండల కేంద్రాలకు చేరుకునేవారని ఆయన చెప్పారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలినప్పుడు వైద్యం అందుబాటులో ఉండేది కాదని, ఐతే ప్రస్తుతం అటువంటి పరిస్థితులు లేకపోవడం వలన గిరిజనులు ఆరోగ్యవంతులుగా ఉంటున్నట్టు ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకోవడం గిరిజనులకు వరప్రసాదం దొరికినట్టయ్యిందన్నారు. ఈ పంచాయతీలో మౌలిక వసతులు కల్పించడంలో అక్కడక్కడ కొన్ని సమస్యలున్నప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో సంతృప్తి చెందవచ్చుని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రికి, పెదలబుడు పంచాయతీకి సంబంధించిన అన్ని అంశాలపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించనున్నట్టు సుందరరామ్ తెలిపారు. పెదలబుడు పంచాయితీ సర్పంచ్ సమర్డి గులాబి, మాజీ సర్పంచ్ సమర్డి రఘునాద్, పంచాయితీ కార్యనిర్వహణ అధికారి అచ్యుతరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.